# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ‘విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్’ .. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చోదకశక్తిగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.

- అఖండ గోదావరి ప్రాజెక్టుతో గోదావరి ప్రాంత పర్యాటకం అభివృద్ధి చెందుతుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

- అనాథ బాలల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

- గడచిన 11 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి ఎం రమేష్ అన్నారు.

==================

‘విశాఖపట్నం ను ఎకనమిక్ రీజియన్’ గా అభివృద్ధి చేసే అంశంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈరోజు సచివాలయంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో 6 పోర్టులు, 7 మాన్యుఫాక్చరింగ్ నోడ్‌లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, 6 సర్వీస్ హబ్స్, 12 పర్యాటక హబ్స్‌తో విశాఖను ఎకనమిక్ రీజియన్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. పోర్టు, ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణీకరణ, మౌలికవసతుల కల్పన... ఇలా 7 గ్రోత్ డ్రైవర్లుగా రూపొందించిన ప్రణాళికలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనికోసం అత్యంత ప్రాధాన్యమైన 41 ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ‘విశాఖ ఎకనమిక్ రీజియన్’ను ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలని అన్నారు. 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి, ఈ రీజియన్ నుంచి జరగాలని సూచించారు. వచ్చే ఏడేళ్లలో విశాఖను ముంబయి నగరంలా తీర్చిదిద్దాలన్నారు. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ పరిధిలోని శ్రీకాకుళం నుండి తూర్పు గోదావరి వరకు మొత్తం 8 జిల్లాల పరిధిలో ఎకనమిక్ యాక్టివిటీ పెరిగేలా ప్రాజెక్టులు నెలకొల్పాలని, దీనికోసం లక్ష ఎకరాల భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

==================

ప్రతిష్టాత్మక అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు ఈ నెల 19వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పార్లమెంట్ సభ్యురాలు పురంధరేశ్వరి శంకుస్థాపన చేయనున్నారని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్ స్కీమ్ (సాస్కి) 2024-25 ద్వారా మంజూరైన 97 కోట్ల రూపాయలతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు జరగనున్నాయని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలలోపే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని, తద్వారా గోదావరి పరిసర ప్రాంతాలు సరికొత్త సొబగులు సంతరించుకోనున్నాయని చెప్పారు. చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని సందర్శకులకు తెలియజేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సందర్శకుల కోసం మెరుగైన వసతుల కల్పనతో పాటు, మంచి అనుభూతిని అందిస్తామన్నారు. 127 ఏళ్ల చరిత్ర కలిగి, వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన హేవలాక్ బ్రిడ్జిని ఆధునీకరిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

==================

అనాథ బాలల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశుగృహం, బాలసదనంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రేడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్, తదితర అభివృద్ధి పనులను ఈరోజు ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అనాధ పిల్లల దత్తతకు సంబంధించిన విధి విధానాలు కేంద్ర మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిశుగృహంలో పిల్లలతో ముచ్చటించి, వారి సమస్యలు, అవసరాలు అడిగి తెలుసుకున్నారు.

===================

శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం సమీపంలోని నాసిన్ కేంద్రంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు వచ్చారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మర్యాదపూర్వకంగా కేంద్ర మంత్రిని కలిసి నంది విగ్రహాన్ని, పుష్పగుచ్ఛాన్ని అందజేసి, స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి పాల్గొన్నారు.

===================

విరామం

===================

ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ దేశంలో దశాబ్ద కాలంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అనేకమందికి పేదరికం నుండి విముక్తి కలిగించిందని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించిందని అన్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారత, తదితర అంశాలపై దృష్టి సారించిందని, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్జ్వల యోజన, జన్ ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సామాన్య ప్రజలకు అనేక ప్రయోజనాలు ఒనగూరాయని ఆయన తెలియజేశారు.

===================

రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల కోసం రాష్ట్రంలో 137, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలియజేశారు. ఈ నెల 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో డీఎస్సీ పరీక్షల నిర్వాహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. విజయవాడలోని పరీక్షా కేంద్రాన్ని ఈరోజు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆహ్లాదకర వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

మచిలీపట్నం మంగినపూడి బీచ్ లో కయాకింగ్ పోటీలను, బీచ్ కబడి, హెలీ రైడ్, పారా గ్లైడింగ్ లను రాష్ట్ర గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంగినపూడి బీచ్ ప్రాంతానికి రాష్ట్రవ్యాప్త గుర్తింపు తెచ్చే విధంగా బీచ్ ఫెస్టివల్‌ను పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారని చెప్పారు. పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడం జరిగిందని తెలిపారు. పి-4 పద్ధతిలో రిసార్ట్‌లు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

===================

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈరోజు పార్వతీపురం పట్టణంలో ఎస్ఎన్ఎం కాలనీలో పీఎం సూర్యఘర్ లబ్ధిదారుల నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ పథకం ఎంతో

ప్రయోజనకరమైనదని, దీని కోసం రుణాలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ రుణాలు మూడు లేదా నాలుగు సంవత్సరాలలో తిరిగి చెల్లించవచ్చని, ఆ తరువాత విద్యుత్ ఉచితంగా లభిస్తుందని తెలిపారు. అవసరాలకు మించి ఉత్పత్తి చేసిన విద్యుత్ ను విక్రయించే అవకాశం కూడా ఉందన్నారు.

===================

శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతీఒక్కరూ యోగా అలవర్చుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విజ్ఞప్తి చేశారు. పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా, ప్రముఖ పర్యాటక ప్రాంతం చింతపల్లి సముద్ర తీరంలో ఈరోజు భారీ యోగా ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ వ్యక్తికి యోగా నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. మానసిక ప్రశాంతతకు, శారీరక ఆరోగ్యానికి యోగా ఒక దివ్య ఔషధమని, యోగావలన వివిధ రకాల జీవనశైలి వ్యాధులను సైతం దూరం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. యోగా గొప్పదనాన్ని, ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు రాష్ట్రంలో భారీ ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు.

===================
===================